సాక్షి
కర్నూలు
గురువారం ; 6 ; జూలై ; 2023



అప్రమత్తతే మందు!

జంతువుల నుంచి సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. నేడు జూనోటిక్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయనున్నారు. 8లో



కేసీకి నీరు విడుదల

గూడూరు: తాగునీటి అవసరాలకు బుధవారం సుంకేసుల డ్యాం నుంచి కేసీ కెనాల్‌కు 189 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.990 టీఎంసీల నిరు నిల్వ ఉంది.



జ్వాలావీరభద్రుడికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో బుధవారం సాక్షిగణపతికి, జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థమై దేవస్థానం ఈ కార్యక్రమం నిర్వహించింది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు

కర్నూలు(అగ్రికల్చర్): నకిలీ, అనధికార విత్తనాల నియంత్రణకు జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో నకిలీలకు తావుండ రాదనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ ప్రతి వారం లోతుగా సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు వేదమణి, వెంకటేశ్వర్లు, ఆదోని భూసంరక్షణ ఏడీ సంధ్యారాణిల నేతృత్వంలో స్క్వాడ్‌లు ఏర్పాటయ్యాయి. ప్రధానంగా ఈ బృందాలు బీటీ పత్తి సాగు, విత్తన ప్యాకెట్లు ఎక్కువగా విక్రయించే ప్రాంతాలపై దృష్టి సారించనున్నాయి. రానున్న మూడు, నాలుగు రోజుల్లో కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు తెలిసింది.

వేళాంగిణి మాత దర్శనానికి ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులో వేళాంగిణి మాత దర్శనం కోసం ప్రత్యేక బస్సు నడపనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7తేదీన శుక్రవారం రాత్రి 8గంటలకు కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి ఈ బస్సు బయలుదేరుతుందని, ఆదివారం ఉదయం జరిగే తెలుగు ప్రార్థనకు హాజరయ్యే విధంగా బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ సర్వీసు (నంబర్-93622)లో పెద్దలకు చార్జీ రూ.3వేలు, పిల్లలకు రూ.2వేలు ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు బుధవారం కర్నూలులోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 28 ఫిజికల్ డైరెక్టర్, 39 బయోలాజికల్ సైన్స్, 82 సోషల్ స్టడీస్ టీచర్ల భర్తీ కౌన్సెలింగ్ నిర్వహించగా ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చారు. గత నెలలో నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్‌లో అవగాహన రాహిత్యంతో నాట్ విల్లింగ్ ఆప్షన్ ఇచ్చామని, ఇప్పుడు అవకాశం ఇవ్వాలని కొందరు విద్యాశాఖ అధికారులను కోరారు. నాట్ విల్లింగ్ ఇచ్చిన తరువాత ఏడాది పాటు పదోన్నతులకు అర్హులు కాదని.. గత నెల పదోన్నతుల సమయంలో ఏ నంబరు దగ్గర అయితే నిలిచిపోయిందో అక్కడి నుంచి మొదలు పెడతామని అధికారులు చెప్పారు. మొదటి రోజు కొంత ఆలస్యంగా మొదలైన కౌన్సెలింగ్ రాత్రి వరకు కొనసాగింది. డీఈఓ రంగారెడ్డి, ఏడీ శ్యామ్యూల్ పాల్, కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, పర్యవేక్షకులు రాజశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

కుమ్మేసిన వర్షం!



కొత్తపల్లి మండలం నందికుంట గ్రామ సమీపంలోని పొలంలో నిలిచిన వర్షపు నీరు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలోని మూడు, నాలుగు మండలాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. కర్నూలు జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురవగా.. నంద్యాల జిల్లాలో అతి భారీ వర్షాలు పడటం విశేషం. కర్నూలు జిల్లాలో 10 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలోనూ 10 మండలాల్లో తేలికపాటి నుంచి అతి భారీ వర్షాలు కురిసినట్లు స్పష్టమవుతోంది. కొత్తపల్లిలో అత్యధికంగా 103.8 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి నల్లమలలో భవనాశి, సుద్దవాగులు పొంగి ప్రవహించాయి. నంద్యాల జిల్లా మొత్తంగా 14.5 మి.మీ.. కర్నూలు జిల్లా మొత్తంగా 1.9 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

లడ్డూప్రసాద విక్రయ కేంద్రాల తనిఖీ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లడ్డూప్రసాద విక్రయ కేంద్రాలను, అన్నప్రసాద వితరణను ఈఓ ఎస్.లవన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ప్రసాద విక్రయ కేంద్రాలలో స్టాక్‌నమోదు, లడ్డూప్రసాదాల టిక్కెట్ల జారీ మొదలైన అంశాలను పరిశీలించారు. అనంతరం అన్నప్రసాద వితరణను పరిశీలించి వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ లడ్డూ ప్రసాదాల కోసం భక్తులు అధిక సమయం క్యూలైన్లలో వేచి ఉండకుండా త్వరిత గతిన ప్రసాదాలను అందించాలన్నారు. అన్నప్రసాద వితరణకు తాజా కూరగాయలనే వినియోగించాలన్నారు.

పొదుపు మార్గం.. పారిశ్రామిక విప్లవం!



నా పేరు ఊర్మిల. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో భవిత పొదుపు సంఘంలో సభ్యురాలిని. పీఎంఎఫ్‌ఎంఈ కింద రూ.4,01,500 వ్యయంతో 2022 మార్చిలో సీడ్ ఆయిల్ మిషన్ ఏర్పాటు చేసుకున్నా. కల్తీకి తావు లేకుండా గానుగతో వంట నూనెలు ఉత్పత్తి చేస్తున్నా. శ్రీ సాత్విక గ్రామీణ చెక్క, గానుగ నూనెల తయారీ కేంద్రం ద్వారా విక్రయాలు సాగిస్తున్నా. అన్ని ఖర్చులు పోను ప్రతి నెలా రూ.30వేల ఆదాయం వస్తోంది.

యూనిట్ కాస్ట్.. సబ్సిడీలు ఇలా..

- రొట్టెల తయారీ కేంద్రాల ఏర్పాటుకు యూనిట్ కాస్ట్ రూ.3.05 లక్షలు. బ్యాంకులు రూ.2,75,500 లోన్‌గా ఇస్తాయి. లబ్ధిదారుల వాటా రూ.30500. ఇందులో పీఎంఎఫ్‌ఎంఈ కింద 35 శాతం చొప్పున రూ.1,06,750 సబ్సిడీ లభిస్తుంది.
- గానుక నూనె తయారీ యూనిట్ కాస్ట్ రూ.4,01,500. లబ్ధిదారుల వాటా రూ.41,150 కాగా.. బ్యాంకులు రూ.3,61,150 లోన్‌గా ఇస్తాయి. సబ్సిడీ రూ.1,40,525.
- పసుపు-కారం తయారీ, ప్యాకింగ్ యూనిట్ కాస్ట్ రూ.4.77 లక్షలు కాగా.. లబ్ధిదారుల వాటా రూ.47,700. బ్యాంకులు రూ.4,29,300 లోన్‌గా ఇస్తాయి. సబ్సిడీ రూ.1,66,950.
- విజిటబుల్ సోలార్ డ్రయర్ యూనిట్ కాస్ట్ లక్ష రూపాయలు కాగా.. బ్యాంకులు రూ.90వేలు లోన్‌గా ఇస్తాయి. రూ.10 వేలు లబ్ధిదారు భరించాలి. సబ్సిడీ 35 శాతం. ఈ యూనిట్ ద్వారా ఒక్కో మహిళ నెలకు రూ.12,500 నుంచి రూ.18వేల వరకు సంపాదించే అవకాశం ఉంది.

రొట్టెల తయారీ కేంద్రం



ఉపాధి అవకాశాలపై మహిళల ఆసక్తి

- ప్రతి మండలంలో 25 యూనిట్ల ఏర్పాటుకు కసరత్తు
- రానున్న రోజుల్లో 12,270 మంది మహిళలకు ఉపాధి
- రూ.70.30 కోట్లతో కార్యాచరణ సిద్ధం
- నాడు పొదుపు మహిళలను దగా చేసిన చంద్రబాబు
- నేడు స్వయంసహాయక సంఘాలకు అండగా సీఎం వైఎస్ జగన్

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల మహిళలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం వరకు సాధారణ పొదుపు మహిళలు నేడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. జీవరోపాధులను అభివృద్ధి చేసుకోవడంలో భాగంగా కొత్తకొత్త యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి చూపుతుండటం విశేషం. ప్రభుత్వం కూడా మహిళా వికాసానికి పెద్దపీట వేస్తోంది. రానున్న రోజుల్లో 12,270 మంది మహిళలకు రూ.70.30 కోట్లతో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టారు. టీడీపీ పాలనలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలను దారుణంగా దగా చేస్తే.. వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలో డీఆర్‌డీఏ-వైకేపీ ఆధ్వర్యంలో 32,477 స్వయంసహాయ సంఘాలు ఉండగా.. వీటిల్లో 3,38,126 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న తోడు, వైఎస్ఆర్ చేయూత, జగనన్న ఆసరా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోంది. వీటి కింద 2019-20 నుంచి స్వయంసహాయక సంఘాల్లోని మహిళలకు దాదాపు రూ.1,350 కోట్ల నగదు ప్రయోజనం లభించింది.

ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటుతో పాటు బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇస్తుండటంతో మహిళల రాణింపునకు మార్గం సుగమమైంది.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా రాణింపు

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే



పసుపు-కారం తయారీ యూనిట్

వేలాది మంది మహిళలు పాడి పశువులు, గొర్రెలు, పొట్టేళ్లు, పెరటికోళ్ల పెంపకం, చీరల వ్యాపారం, కిరాణం షాపులతో ఉపాధి పొందుతున్నారు. కర్నూలు, కల్లూరు, హాలహర్వి, ఎమ్మిగనూరు తదితర మండలాల్లో పలువురు మహిళలు రాణిస్తున్నారు. ఇవే కాకుండా జిల్లాలో తాజాగా రొట్టెల తయారీ కేంద్రాలు, గానుగ నూనె ఉత్పత్తి, పసుపు-కారం తయారీ, ప్యాకింగ్ యూనిట్‌లు, ఊదిబత్తీల తయారీ, ఫిష్ ఆంధ్ర, ఫిష్ కియోస్క్ తదితరాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి మండలంలో 25 యూనిట్ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది. పొదుపు మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువుల మార్కెటింగ్ విషయంలోనూ అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపుతోంది.

రూ.70.30 కోట్లతో మహిళలకు జీవనోపాధులు

రానున్న రోజుల్లో మహిళల జీవనోపాధులను మెరుగుపరిచే దిశగా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. 12,270 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ మహిళల జీవనోపాధికి రూ.70.30 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. 134 వృత్తుల్లో రాణించేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఆ మేరకు యూనిట్ల ఏర్పాటును ఉద్యమ తరహాలో చేపడుతున్నారు. ఇప్పటికే దాదాపు 300 యూనిట్లు గ్రౌండింగ్ చేయడం విశేషం. బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలు ఇప్పించడం, లింకేజీ రుణాలు, స్త్రీ నిధి, ఉన్నతి కింద పెద్ద ఎత్తున రుణాలు సమకూరుస్తుండగా.. వైఎస్ఆర్ చేయూత, జగనన్న ఆసరా కింద కూడా ఆర్థిక వెసులుబాటు కలుగుతోంది.



గానుగ నూనె తయారీ యూనిట్

మహిళా వికాసానికి పెద్దపీట

ఉపాధి రంగాల్లో మహిళల రాణింపునకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఎంపీఎఫ్ఎంఈ కింద వివిధ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాం. సబ్సిడీ 35 శాతం లభిస్తుంది. వైఎస్ఆర్ చేయూత, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాలను ప్రభుత్వం క్రమం తప్పకుండా అమలు చేస్తోంది. వీటి కింద మహిళలకు రూ.1,350కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం లభించింది. రానున్న రోజుల్లో 4వేల మంది పొదుపు మహిళలకు విజిటబుల్ సోలార్ డ్రయర్లు మంజూరు చేస్తున్నాం. – మల్లికార్జున, పీడీ, డీఆర్‌డీఏ-వైకేపీ

ప్రజాదరణ లేకనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- టీడీపీ నాయకుల బెదిరింపులకు భయపడం
- కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోం
- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ప్రజాదరణ కోల్పోయిన టీడీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. బుధవారం పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బస్సు యాత్ర చేస్తూ హోసూరులో జరిగిన సభలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు వైఎస్సార్‌సీపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. తొడగొట్టి, అంతు చూస్తామని బెదిరించడం చూస్తే వారు ఎంత మూర్ఖంగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రజల్లోకి వెళ్లి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోసం కృషిచేయాలి కానీ.. చౌకబారు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పాటు టీడీపీకి చెందిన వారు కూడా ఓటు వేయడంతోనే తనకు అత్యధిక మెజార్టీ వచ్చిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా గ్రామాల్లో గొడవలను, ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించలేదన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో కేఈ కృష్ణమూర్తి డిప్యూటీ సీఎం హోదాలో ఉండి పత్తికొండను అభివృద్ధి చేయకపోవడంతోనే ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారన్నారు. నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీ-నీవా నీటిని మళ్లించే పనుల విషయంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హత్యా రాజకీయాలు చేసే చరిత్ర వారిదే అని ఆరోపించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ నారాయణదాసు, వైస్ ఎంపీపీ బలరాముడు, మాజీ వైస్ ఎంపీపీ పల్లె ప్రతాప్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బనగాని శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, సచివాలయ మండల కన్వీనర్ మోహన్‌క్రిష్ణ, సర్పంచులు కేశవరెడ్డి, శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు గాంధీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లలితా రామచంద్ర, నీలకంఠ, నెట్టేకల్లు, కేశప్ప, నార్లతిప్పయ్య, కరువాల హుసేన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి

- 21 నుంచి బీఎల్‌ఓలు ఇంటింటా తిరగాలి
- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన



హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికలకు మరో 10 నెలలు మాత్రమే ఉండడంతో భారత ఎన్నికల సంఘం ఈసారి రెండు నెలలు ముందుగా ఓటరు సవరణపై ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక ఓటరు సవరణ-2024పై ఎన్నికల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం -2024 (ఎస్ఎస్ఆర్-2024)లో భాగంగా జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్ఓ) ఇంటింటా తిరగాలన్నారు. జూలై 20లోపు ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓలకు శిక్షణ తరగతులను పూర్తి చేయాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆదేశించారు. 18 ఏళ్లునిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్పించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు ఫారమ్-6, 7, 8లను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫారమ్-6, 7, 8లు గతంలో 5,200 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. సెప్టెంబర్ 29 లోపు పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని ఆర్ఓలు, ఏఆర్ఓలను ఆదేశించారు. అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో ఓటరు సవరణపై ప్రత్యేక క్యాంపులను అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ఒకే ఇంటిలో పది ఓట్లకు మించి ఉంటే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేయాలని ఏఆర్ఓలను ఆదేశించారు. పూర్తి విచారణ చేయకుండా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయవద్దన్నారు. అవసరమైన పోలింగ్ కేంద్రాల మార్పుపై కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్. మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర భార్గవ్‌తేజ, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, కర్నూలు, పత్తికొండ, ఆర్‌డీఓలు హరిప్రసాదు, మోహన్‌దాసు, ఇల్లాలోని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

పొరపాట్లకు తహసీల్దార్లే బాధ్యులు

వెబ్‌ల్యాండ్ ట్రాన్సాక్షన్లలో పొరపాట్లకు తహసీల్దార్లే బాధ్యులవుతారని కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రీసర్వే, స్పందన, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వెబ్ ల్యాండ్ ట్రాన్సాక్షన్లలో ప్రతి ఫైలుకు కచ్చితంగా అనుబంధ ఫైల్ ఉండాలన్నారు. గత నెలలో జరిగిన వాటిపై ఆడిట్ చేయిస్తానన్నారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులు జరగకుండా చూడాలని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్య లు తప్పవని హెచ్చరించారు. జేసీ ఎస్. మౌర్య మాట్లాడుతూ..రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు అప్పీళ్లను తీసుకోవడంలేదని, ఏడీ సర్వే, కల్లూరు తహసీల్దార్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో అప్పీళ్ల నిర్వహణపై శిక్షణ ఇప్పిస్తామన్నారు. అబాది భూముల సర్వేకు సంబంధించి 67 గ్రా మాలకు గాను మొదటి దశలో 43 గ్రామాల్లో గ్రౌండ్ వ్యాలిడిటేషన్ పూర్తి చేసి 41 గ్రామాల్లో ఫైనల్ ఆర్ఓఆర్ ఇచ్చినట్లు చెప్పారు. మిగిలిన గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, 13 నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు.

‘జగనన్న సురక్ష’కు విశేష స్పందన

- వెంటనే చేతికందుతున్న ధ్రువీకరణ పత్రాలు
- సమయం, డబ్బు ఆదా అవుతుండడంతో భారీగా తరలి వస్తున్న లబ్ధిదారులు
- ఇప్పటి వరకు 46,676 మందికి సర్టిఫికెట్ల మంజూరు

కౌలు రైతు కార్డు వెంటనే ఇచ్చారు



ఈ ఫొటోలో కౌలు రైతు కార్డు అందుకుంటున్న వ్యక్తి పేరు నరసింహయ్య. ఆస్పరి బీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోగా స్పందించిన అధికారులు విచారణ జరిపి వెంటనే కౌలు రైతు కార్డు అందజేశారు. గతంలో కౌలు రైతు కార్డు కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా రాలేదని, ప్రస్తుతం అప్పటికప్పుడే ఉచితంగా మంజూరు చేయడంపై ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు(సెంట్రల్): జగనన్న సురక్ష క్యాంపులకు విశేష స్పందన లభిస్తోంది. అవసరమైన సర్టిఫికెట్లు వెంటనే అందజేస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాలు, మండల కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి అవసరం లేకుండా అధికారులే ఇంటికి వచ్చి వివరాలు తీసుకుని, జగనన్న సురక్ష క్యాంపుల్లో సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 46,676 సర్టిఫికెట్లను అధికారులు ప్రజలకు అందజేశారు. మొత్తం 1,04,915 మంది వివిధ రకాల సర్టిఫికెట్లు కావాలని టోకెన్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 88,434 మందికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 46,676 మందికి సర్టిఫికెట్లను అందజేయగా.. మరో 41,040 ధ్రువీకరణ పత్రాలను రానున్న రోజుల్లో పంపిణీ చేయనున్నారు. అర్హత లేకపోవడంతో 20 వేలకుపైగా వినతులను సర్వీసు రైజ్ సమయంలోనే తిరస్కరించారు. మరో 718 అభ్యర్థలను పరిశీలనలో తిరస్కరించారు. బుధవారం కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్.. నగరంలోని 109వ వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించిన సురక్ష క్యాంపులో పాల్గొని ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కర్నూలు అర్బన్‌లోని 45వ వార్డు సచివాలయంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె. సుధాకర్ గూడూరు, కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు, పసుపల గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులకు హాజరయ్యారు.

సమయం..డబ్బు ఆదా

కర్నూలు జిల్లాలో 472 రెవెన్యూ గ్రామాల పరిధిలో 672 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. గతంలో పోల్చుకుంటే ప్రజలు నివాసం ఉంటున్న సమీపంలోనే ఉండే సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సి వచ్చేది. అలాగే కొంత డబ్బు చెల్లించాల్సి ఉండేది. జగనన్న సురక్ష క్యాంపుల్లో వేచి చూడాల్సిన అవసరం లేకుండా, డబ్బు చెల్లించకుండా కులం, ఆదాయం, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. అలాగే జనన, మరణ, పెళ్లి, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. మ్యుటేషన్ సర్టిఫికెట్, సీసీఆర్‌సీ కార్డులు, కుటుంబ సభ్యుల విభజన పత్రం అందిస్తున్నారు. రైస్, ఆధారు కార్డుల్లో మార్పులు సైతం చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా ఇస్తుండడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అర్హులై ఉండి వివిధ సంక్షేమ పథకాలకు ఎంపిక కాని వారికి వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటుండడంతో సురక్ష క్యాంపులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

సర్టిఫికెట్	గతంలో సర్టిఫికెట్ ఇచ్చేందుకు వ్యవధి, ఫీజు మొత్తం రూ.ల్లో	ప్రస్తుతం ఇలా
ఇంటిగ్రేటెడ్	7 రోజులు, రూ.50	వెంటనే, ఉచితం
కులం	7 రోజులు, రూ.50	..
ఇన్‌కమ్	7 రోజులు, రూ.50	..
జనన	90 రోజులు, రూ. 135	..
మరణ	90 రోజులు, రూ. 135	..
ఫ్యామిలీ మెంబర్	30 రోజులు, రూ.50	..
మ్యారేజ్	30 రోజులు, రూ. 250	..
ఆధార్ అప్‌డేషన్	3 0రోజులు రూ.100 నుంచిరూ. 250	..
రైస్ కార్డు	ఆరు నెలలకుఒకసారి,ఉచితం	..
మ్యూటేషన్ ఫర్ ట్రాన్సక్షన్స్	30 రోజులు, రూ.135	..
కుటుంబ సభ్యుల విభజన	నిర్ణీత గడువు లేదు, ఉచితం	..

ఎస్‌డబ్ల్యూపీసీ వివరాలు పంపండి

కర్నూలు(అర్బన్‌): జిల్లాలో ఎన్ని సాలీడ్‌ వెల్త్‌ ప్రాసెసింగ్‌ సెంటర్లు (ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్మిస్తున్నారు.. ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి.. మిగిలినవి ఏఏ దశల్లో ఉన్నాయి.. షెడ్లు పూర్తయ్యేందుకు ఎన్ని నిధులు అసరమవుతాయి.. తదితర వివరాలను రెండు, మూడు రోజుల్లో పంపాలని అధికారులను పీఆర్‌అండ్‌ఆర్‌డీ ప్రిన్సిపల్‌ సెక్రటరీ రాజశేఖర్‌ ఆదేశించారు. బుధవారం ఆయన పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్‌ సూర్యకుమారితో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఎన్ని వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి? ఇంకా ఎన్ని అవసరమవుతాయనే విషయాలను కూడా వెంటనే పంపించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు లిక్విడ్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టమ్‌పై ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీలను నిర్మించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అలాగే స్వామిత్వ కింద గ్రామ కంఠం భూముల సర్వేను త్వరగా పూర్తి చేసి ఆయా గ్రామాల్లోని వారికి ఆస్తి హక్కు పత్రాలను అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతిచెందిన సుదర్శనరెడ్డి

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామానికి చెందిన వేమిరెడ్డి సుదర్శన రెడ్డి (27) అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. మృతుడి ఇంట్లో మంగళవారం రాత్రి కరెంట్‌ పోయింది. ఉదయం నిద్ర లేచి చూడగా సర్వీసు తీగ తెగి కిందకి వేలాడుతుంది. దానిని చేతితో పట్టుకుని పరిశీలిస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ఈ మేరకు మృతుడి తండ్రి శివ శంకర్‌ రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. అవివాహితుడైన సుదర్శన రెడ్డి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మృతదేహం వెలికితీసి రీ పోస్టుమార్టం

నందవరం: మండలంలోని నది కైరవాడి గ్రామం వద్ద గతేడాది మార్చి 4న తుంగభద్ర నదిలో గుర్తు తెలియని శవం లభ్యం కావడంతో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి పాతిపెట్టిన విషయం విదితమే. ఆ మృతదేహాన్ని బుధవారం మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, నందవరం ఎస్‌ఐ తిమ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్‌ రఘువీర, గ్రూప్‌ ఆఫ్‌ డాక్టర్లు చిరంజీవి, మల్లికార్జున ఆధ్వర్యంలో వెలికితీసి రీపోస్టుమార్టం నిర్వహించారు. ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు.. మృతదేహం పట్ల పలు అనుమానాలు ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు, డాక్టర్ల నేతృత్వంలో రీపోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. డీఎన్‌ఏ రిపోర్టు ఆధారంగా విచారణ చేపడాతమని ఎస్‌ఐ తెలిపారు. వీఆర్వో రాఘవేంద్ర, పోలీసులు మల్లికార్జున తదితరులు ఉన్నారు.

డిగ్రీ కాలేజీల్లో ఉద్యోగ విద్య!

- ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సు
- పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న వర్సిటీ అధ్యాపకులు
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి



కర్నూలు (న్యూసిటీ): ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే విధంగా డిగ్రీ కోర్సులను సరికొత్తగా రూపకల్పన చేశారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌) సూచన మేరకు యూనివర్సిటీలు నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ హానర్స్‌, హానర్స్‌ విత్‌ రీసెర్చ్‌ డిగ్రీ కోర్సులను కొన్ని డిగ్రీ కాలేజీలు ప్రారంభించనున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 100 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కాలేజీలు 13, ఎయిడెడ్‌ కళాశాలలు 7 ఉన్నాయి. ఉన్నత విద్యామండలి మార్గదర్శకాల ప్రకారం వసతులు ఉన్న కాలేజీల్లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టనున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం రాయలసీమ యూనివర్సిటీ అధ్యాపకులు సదస్సులు నిర్వహిస్తున్నారు. కర్నూలులో రాయలసీమ, ఉర్దూ, క్లస్టర్‌ యూనివర్సిటీలు ఉన్నాయి. వీటి పరిధిలోని కాలేజీ విద్యార్థులకు నూతన డిగ్రీ కోర్సులు ఎంతో ఉపయోగపడనున్నాయి. ఈ కోర్సు పూర్తయితే దేశంలో ఎక్కడైనా ఉన్నత విద్య అభ్యసించవచ్చని, విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు సులభంగా లభిస్తాయని వర్సిటీ అధ్యాపకులు చెబుతున్నారు. దీంతో యూజీ ఆనర్స్‌ కోర్సుపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతోంది.

కోర్సులు ఇలా..

బీఏ ఆనర్స్‌ : హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్‌, ఎకనామిక్స్‌, పొలిటికల్‌ సైన్స్‌, స్పెషల్‌ ఇంగ్లిష్‌, స్పెషల్‌ తెలుగు, ఒక మేజర్‌ సబ్జెక్ట్‌గా ఉంటాయి. మైనర్‌ సబ్జెక్టులుగా సోషియాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌, సైకాలజీ ఉంటాయి.

బీఎస్సీ ఆనర్స్‌ : కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ, ఫిజిక్స్‌, ఎలక్ట్రానిక్స్‌, నానో టెక్నాలజీ, కంప్యూటర్‌ సైన్స్‌, డేటా సైన్స్‌, మాథమేటిక్స్‌, స్టాటిస్టిక్స్‌, బోటనీ, హార్టికల్చర్‌, జువాలజీ, అగ్రికల్చర్‌, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ మేజర్‌ సబ్జెక్టులుగా ఉంటాయి. మైనర్‌ సబ్జెక్టులుగా ఫుడ్‌ టెక్నాలజీతోపాటు ఎంపిక చేసుకున్న కోర్సుకు ఆధారంగా మరికొన్ని సబ్జెక్టులుగా ఉంటాయి.

ఇవీ మార్పులు..

- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నూతన సిలబస్‌ ప్రవేశ పెట్టారు.
- కళాశాల నుంచి కొలువులు దక్కేలా ప్రత్యేక నైపుణ్యాలపై దృష్టి పెట్టేలా అవకాశాలు కల్పించారు.
- ఇంటర్న్‌షిప్‌ తప్పనిసరి చేశారు.
- బీటెక్‌ కోర్సుకు దీటుగా డిగ్రీ సిలబస్‌ రూపకల్పన చేశారు.

నాలుగేళ్ల డిగ్రీతో చాలా ఉపయోగం



నాలుగేళ్ల యూజీ కోర్సు పూర్తి చేస్తే దేశంలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలు ఉంటాయి. నాలుగేళ్ల చదివితే డిగ్రీతోపాటు పీజీ మొదటి సంవత్సరం చేసినట్లు సర్టిఫికెట్‌ వస్తుంది. తరువాత పీహెచ్‌డీ చేసుకోవచ్చు. డిగ్రీలో అయితే మూడేళ్ల పూర్తి చేసి నాలుగో ఏడాది బీఈడీ చదువుకోవచ్చు. - బాయినేని శ్రీనివాసులు (రిజిస్ట్రార్‌, ఉర్దూ యూనివర్సిటీ)

బీకాం ఆనర్స్‌: బీకాం జనరల్‌, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌, బీబీఏ డిజిటల్‌ మార్కెంటింగ్‌, బ్యాంకింగ్‌ ఇన్సూరెన్స్‌ ఫైనాన్సియల్‌ సర్వీసెస్‌, అకౌంట్స్‌ అండ్‌ టాక్సెస్‌ మేజర్‌ సబ్జెక్టులుగా ఉంటాయి.

డిగ్రీతోపాటు బీఈడీ: నూతన విద్యావిధానంలో బీఈడీ కోర్సు డిజైన్‌ చేశారు. దీంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉపాధ్యాయ విద్య అందుతుంది. కెనడా, న్యూజిలాండ్‌, అమెరికా దేశాల్లో అధ్యయనం చేసి ఈ కోర్సు అమల్లోకి తెచ్చారు. డిగ్రీ మూడేళ్లు, బీఎడ్‌ రెండేళ్లు చదవాల్సిన అవసరం లేకుండా కేవలం నాలుగేళ్లలోనే మొత్తం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఎస్‌జీటీ, స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులకు అర్హత ఉంటుంది.

యూజీ ఆనర్స్‌: మొదటి సంవత్సరం పూర్తి చేస్తే సర్టిఫికెట్‌ ఇస్తారు. రెండో ఏడాది పూర్తి చేసిన వారికి డిప్లొమో వస్తుంది. మూడేళ్లు పూర్తి చేస్తే డిగ్రీ, నాలుగో ఏడాది ఉత్తీర్ణులైతే ఆనర్స్‌ పట్టా పొందుతారు. నాలుగేళ్లు ఆనర్స్‌ పూర్తి చేసిన తరువాత పీజీ ఏడాది చదివితే నేరుగా పీహెచ్‌డీ చేసే అవకాశం ఉంటుంది.

ఏటీఎంలో దృష్టి మరల్చి చోరీ

ఆళ్లగడ్డ: ఏటీఎంలో నగదు డ్రా చేసుకునేందుకు వెళ్లిన ఓ వ్యక్తి దృష్టి మరల్చి నగదు చోరీ చేశారు. ఈసంఘటన ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని నల్లగట్లకు చెందిన వ్యవసాయ కూలీ సుబ్బగురప్ప గతనెల 23వ తేదీన వ్యక్తిగత పనిమీద ఆళ్లగడ్డకు వెళ్లాడు. ఖర్చులకు డబ్బు అవసరమైతే బస్టాండ్‌ ఎదురుగా ఉన్న ఏటీఎం కేంద్రంలోకి వెళ్లాడు. అంతలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం కేంద్రలోకి వెళ్లి మాటలు కలిపి అతని ఏటీఎం కార్డు మార్చేశారు. అప్పటికే పిన్‌ నంబర్‌ గమనించి ఉండటంతో సుబ్బగురప్ప వెళ్లిన తర్వాత విడతల వారీగా కార్డుతో రూ. 60,500 నగదు డ్రా చేసుకున్నారు. డబ్బు డ్రా అయినట్లు ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌ను ఇటీవల గమనించిన బాధితుడు బుధవారం పోలీసులకు ఆశ్రయించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

ఒంటరి మహిళకు వేధింపులు

- హోసన్నా వృద్ధాశ్రమం నిర్వాహకుడిపై కేసు నమోదు

డోన్‌ టౌన్‌: మహిళను వేధించిన కేసులో డోన్‌ పట్టణంలోని హోసన్నా వృద్ధాశ్రమం నిర్వాహకుడు జాన్‌ ప్రభాకర్‌పై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. నందికొట్కూరు చెందిన ఓ ఒంటరి మహిళ వృద్ధాశ్రమంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఈమెను ఆశ్రమ నిర్వాహకుడు మానసికంగా, శరీరకంగా వేధిస్తున్నాడు. బుధవారం రాత్రి ఏకంగా ఆశ్రమంలో బంధించి ఒండిపై దుస్తులు తొలగించి కొడుతుండగా బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. చుట్టు పక్కల ఇళ్లలోని వారు వెళ్లగా జాన్‌ ప్రభాకర్‌ గది తలుపులు తీయకపోవడంతో వారు ఆగ్రహించి పాత్రికేయులు, పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లగా బాధితురాలి జరిగిన దాడి గురించి చెప్పి బోరున విలపించింది. గత కొన్నిరోజుల నుంచి తనను వేధిస్తున్నాడని, ఊరికి పంపడం లేదని వాపోయింది. ఆశ్రమం నిర్వాహకుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డోన్‌ పట్టణ సీఐ శేషయ్య తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


హిమబిందును అభినందిస్తున్న పీడీ వెంకటేశ్వర్లు

కర్నూలు (న్యూటౌన్‌): కర్నూలు మండలం గార్గేయపురం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని బోయ హిమబిందు ఒక వైపు చదువులో, మరోవైపు హాకీలో రాణిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 7న ఒడిశా రాష్ట్రం రూర్కెలాలో జరిగే 13వ హాకీ ఇండియా జూనియర్‌ ఉమెన్‌ పోటీల్లో సత్తా చాటేందుకు సాధన చేస్తోంది. హిమబిందు తల్లిదండ్రులు బోయ చంద్రమ్మ, బోయ వెంకటేశ్వర్లు వ్యవసాయ కూలీలు. చిన్ననాటి నుంచే ఆటల పోటీలపై ఎంతో ఆసక్తి కలిగిన ఆమె ఫిజికల్‌ డైరెక్టర్‌ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శిక్షణ పొందింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో పాఠశాలలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు, గ్రామ ప్రజలు అభినందించారు.

ముగిసిన వెదురు వేలాలు

రుద్రవరం: స్థానిక కలప డిపోలో బుధవారం నంద్యాల డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్‌ వెదురు,కలపకు వేలం పాటలు నిర్వహించారు. డీఎఫ్‌ఓ తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది రుద్రవరం రేంజిలోని పలు ఏరియాల్లో వెదురు సేకరణకు సంబంధించి ఇచ్చిన లక్ష్యం పూర్తయ్యిందని తెలిపారు. మొదటి,రెండవ,మూడవ తరగతులకు చెందిన 13,600 వెదుర్లకు చివరి వేలం నిర్వహించగా రూ.3.45 లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అలాగే వివిధ జాతులకు చెందిన కలపకు వేలం వేయగా వేలం పా డేందుకు కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాలేదు. నేటితో వెదురు వేలాలు ముగిశాయని, ఈ ఏడాది అక్టోబర్‌ నుంచి వెదురు సేకరణ తిరిగి మొదలవుతుందని చెప్పారు. రుద్రవరం రేంజి అధికారి శ్రీ పతినాయుడు, డీఆర్వో ముర్తుజా, ఫారెస్టర్లు నాగరాజు, రాణెమ్మ, శ్రీనివాసరెడ్డి, కాంట్రాక్టరు కొల్లం పుల్లయ్య ఉన్నారు.

రూ.42.5 లక్షల విత్తన విక్రయాలు నిలిపివేత


గణేష్‌ హైబ్రిడ్‌ సీడ్స్‌ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కర్నూల్‌ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ మహేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్‌: పట్టణంలోని రెండు విత్తన దుకాణాల్లో రూ.42.5 లక్షల విలువచేసే విత్తన విక్రయాలు నిలుపుదల చేసినట్లు కర్నూలు ఏడీఏ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన బుధవారం ఏఓ మహేశ్వరరెడ్డితో కలిసి శ్రీ గణేష్‌ హైబ్రిడ్‌ సీడ్స్‌, శ్రీపంచముఖి ఫెస్టిసైడ్స్‌, పంచముఖి ట్రేడర్స్‌ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. గణేష్‌ సీడ్స్‌లో దుకాణంలో రూ.26.5 లక్షలు, పంచముఖి ఫెస్టిసైడ్స్‌ దుకాణంలో రూ.13లక్షలు, పంచముఖి ట్రేడర్స్‌లో రూ.3 లక్షలు విలువ చేసే విత్తన విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు చెప్పారు. విత్తనాలకు సంబంధించిన సర్టిఫికెట్స్‌ చూయిస్తే అమ్మకాలకు అనుమతిస్తామని తెలిపారు. అలాగే పట్టణంలోని మంగళ గూడ్స్‌, ఏఎస్‌ఎల్‌ పార్సిల్‌ సర్వీస్‌లో అనుమతి లేని మిరప, ఉల్లి విత్తన ప్యాకెట్లను సరఫరా చేయరాదని పేర్కొన్నారు.

అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలి


సి.బెళగల్‌లో విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్‌: ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలను ఎంఆర్పీ ధరలకే రైతులకు విక్రయించాలని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ఏడీఏ వేదమణి ఆదేశించారు. ఆమె బుధవారం డీఆర్‌సీ ఏఓ హేమలత, మండల ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి సి.బెళగల్‌లోని విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కిసాన్‌మాల్‌, శివసాయి, ఓం శ్రీ నాగ సాయి, మంజునాథ విత్తన దుకాణాల్లో నిల్వల రికార్డులు, బిల్లులు, అమ్మకాల రిజిష్టర్లను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు విక్రయించాలని, నిషేధిత విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు దారులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, ధరలు, నిల్వల బోర్డులను ప్రదర్శించాలని, రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. అక్రమాలకు పాల్పడే డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కిసాన్‌మాల్‌లో సరైన రికార్డులు లేని రూ.12 వేల విలువైన విత్తనాల అమ్మకాలను నిలిపివేసినట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. వీరి వెంట ఎంపీఈఓలు, వీఏఏఎస్‌లు ఉన్నారు.

శ్రీశైలంలో అభివృద్ధి పనులపై ఏసీబీ తనిఖీలు

- 2017, అంతకుముందు జరిగిన పనుల పరిశీలన
- మరో రెండు రోజులు కొనసాగనున్న తనిఖీలు


క్షేత్రపరిధిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల దేవస్థానంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులపై ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఏసీబీ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ వంశీనాథ్‌ నేతృత్వంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల బృందం 2017 వ సంవత్సరం, అంతకు ముందు జరిగిన పలు ఇంజనీరింగ్‌ పనులను పరిశీలించారు. మాడవీధులు, ఔటర్‌ రింగ్‌రోడ్డు, అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ వాటర్‌ సిస్టమ్‌, పుష్కరిణి, శివాజీ గోపురం, సీవరేజ్‌ ప్లాంట్‌ తదితర వాటిని తనిఖీ చేశారు. ఆయా పనులకు సంబంధించిన టెండరింగ్‌ విధానం, మంజూరు తదితర వివరాలను దేవస్థానం ఇంజినీరింగ్‌ అధికారుల నుంచి సేకరించారు. క్షేత్ర పరిధిలో చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. మరో రెండు రోజుల పాటు ఈ తనిఖీలు కొనసాగనున్నట్లు ఏసీబీ సీఐ వంశీనాథ్‌ తెలిపారు. ఇంజినీరింగ్‌ పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు అందడంతో తనిఖీలు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు వెల్లడించారు.

భారీగా రేషన్‌ బియ్యం పట్టివేత


సీజ్‌ చేసిన బియ్యం, లారీ

బనగానపల్లె: అక్రమంగా లారీలో బనగానపల్లె వైపు తరలిస్తున్న 331 ప్యాకెట్ల రేషన్‌ బియ్యాన్ని బుధవారం విజిలెన్స్‌ అధికారులు సీజ్‌ చేశారు. పక్కా సమాచారంతో మండలంలోని నందివర్గం-కైప గ్రామాల మధ్య లారీ వెళ్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్‌ దేజిప్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని డాన్‌ శ్రీనివాసులు, అన్వర్‌ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్‌కుమార్‌ తెలిపారు.

'జూనోటిక్‌'కు అప్రమత్తతే మందు!

- పశువుల నుంచి 280 రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం
- ప్రతి ఏటా జూలై 6న జూనోటిక్‌, జూనోసిస్‌ దినోత్సవం
- నేడు పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్‌ వ్యాక్సిన్లు


వీధుల్లో కుక్కల స్వైర విహారం

కర్నూలు(అగ్రికల్చర్‌): అప్రమత్తంగా ఉంటే జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే 280 జూనోటిక్‌ వ్యాధులను అరికట్టవచ్చు. ప్రతి ఏటా జూలై 6వ తేదీన జూనోసిస్‌ దినోత్సవం నిర్వహిస్తున్నారు. గురువారం కర్నూలులోని బహుళార్ధ పశువైద్యశాలతో పాటు అన్ని ఏరియా పశువైద్యశాలలు, వెటర్నరీ డిస్పెన్సరీల్లో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్‌ టీకాలు ఉచితంగా వేయనున్నారు. జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఆరువేల డోసుల వ్యాక్సిన్‌ను పశువైద్యశాలలకు సరఫరా చేసింది. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై పశువైద్యాధికారులు అవగాహన కల్పించనున్నారు.

పిచ్చి కుక్కల స్వైరవిహారం

ఇటీవలి కాలంలో జిల్లాలో పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలువురిని కాటు వేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. వ్యాధి లక్షణాలు బయటపడిన తర్వాత చికిత్స లేదు. కుక్క కరిచిన 10 రోజుల నుంచి కొన్ని నెలల వరకు వ్యాధి కనిపించే అవకాశం ఉంటుంది. కుక్క కరిచిన గాయాలను సబ్బునీటితో శుభ్రంగా కడగాలి. కోర్సు ప్రకారం యాంటీ రేబిస్‌ టీకా వేయించుకోవాలి. పెంపుడు కుక్కలకు రేబిస్‌ నిరోధక టీకాలను ప్రతి ఏటా వేయించాలి. రాబ్డోవైరస్‌ సూక్ష్మ క్రిమి వల్ల కుక్క కాటు ద్వారా సంక్రమిస్తుంది. ఈ వ్యాధి సోకిన మనిషి నీటిని చూసి భయపడటం గమనించవచ్చు. ఊర కుక్కలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం



జూనోటిక్‌ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్‌ వ్యాక్సిన్‌ వేయడానికి ఏర్పాట్లు చేశాం. ఆరు వేల డోసుల వ్యాక్సిన్‌ను పశువైద్యశాలలకు పంపాం. జంతువుల నుంచి సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. - డాక్టర్‌ రామచంద్రయ్య, జాయింట్‌ డైరెక్టర్‌, జిల్లా పశుసంవర్ధకశాఖ

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- మరగకాచిన పాలను, బాగా ఉడకబెట్టిన మాంసాన్ని మాత్రమే తినాలి.
- కలుషితమైన నీటిని తాగరాదు.
- ఇంటి పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- జూనోటిక్‌ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి.
- జంతువులను శాస్త్రీయ పద్ధతుల్లో పోషించాలి.
- పెంపుడు కుక్కలకు సకాలంలో యాంటీ రేబిస్‌ వ్యాక్సినేషన్‌ చేయించాలి.
- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేసి, వెంటనే చికిత్స అందించాలి.